నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 10 డిసెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన వడ్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్

వడ్లు తడిసి మొలకెత్తుతున్నా కొనరా?

బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్

జన్నారం, డిసెంబర్ 9 : కొనుగోలు కేంద్రాల్లో వడ్లు తడిసి మొలకెత్తుతున్నా ఎందుకు కొనడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ ప్రశ్నించారు. సోమవారం జన్నారంలోని మార్కెట్ యార్డు, తిమ్మాపూర్‌లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తెచ్చిన ధాన్యాన్ని తేమ పేరుతో నెల రోజుల పాటు కొనకపోవడంతో వర్షానికి తడిసి మొలకలు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం టార్పాలిన్ కవర్లు కూడా ఇవ్వలేదన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చిన సమయంలో అధికారుల నిర్లక్ష్యంతో కొనుగోలు కేంద్రాల్లో తడిసిపోయి రైతులు నష్టపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా వెంటనే వడ్లు కొనాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకుడు గుర్రం రాజారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్, మున్వర్ అలీఖాన్, జిల్లా అధికారప్రతినిధి సిటిమల భరత్‌కుమార్, ఫజల్‌ఖాన్, జాడి గంగాధర్, వినయ్‌కుమార్, సింగిల్ విండోచైర్మన్ నాసాని రాజన్న, బాలసాని శ్రీనివాస్‌గౌడ్, వీ నర్సాగౌడ్, జంగ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 9 : పదవికాలంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర జేఏసీ చేపట్టిన 'చలో అసెంబ్లీ'కి తరలేందుకు సిద్ధమైన మాజీ సర్పంచ్‌లను సోమవారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ వడ్డీకి అప్పులు తెచ్చి గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టామని, వాటి బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. బిల్లుల కోసం ప్రభుత్వానికి విన్నవించేందుకు వెళ్తుంటే తమను అరెస్ట్ చేయడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలో హాజీపూర్, చెన్నూర్, లక్షెట్టిపేట, కోటపల్లి, కాసిపేట, బెల్లంపల్లి, మందమర్రి, నెన్నెల, వేమనపల్లి మండలాల్లో మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేశారు.

కోటపల్లి పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న మాజీ సర్పంచ్‌లు

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

దీక్షలకు మద్దతు తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

నస్పూర్, డిసెంబర్ 9 : సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘం నాయకులు హెచ్చరించారు. సమస్యలను పరిష్కరించాలని సోమవారం మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు ఐఎన్‌టీయూసీ జిల్లాప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్నిర ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్షలో మల్లన్న, అరుణ, సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెబాట

సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

- రెగ్యులరైజ్ చేసి తక్షణమే పే-స్కేల్ అమలు చేయాలి
- ప్రభుత్వం స్పందించని పక్షంలో రేపటి నుంచి సమ్మె
- అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరిక

మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలో సమగ్ర శిక్ష ఉద్యోగులు

మంచిర్యాల, డిసెంబర్ 9(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'విద్యా శాఖ-సమగ్ర శిక్ష'లో కాంట్రాక్ట్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో నేటి(మంగళవారం) నుంచి ఉద్యోగులు సమ్మె బాట పట్టనున్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెగ్యులరైజ్ చేసి, వెంటనే పే-స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గడిచిన నాలుగు రోజులు రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట రిలే దీక్షలు చేస్తున్నారు. సమస్యల పరిష్కారానికి పక్షం రోజుల ముందే కార్యాచరణ ప్రకటించి, ఈ నెల 10వ తేదీన సమ్మెకు వెళ్తామని చెప్పినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మీ అందరినీ రెగ్యులర్ చేస్తామని, గతేడాది నవంబర్ 18వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగులకు హామీ ఇచ్చారు. కానీ.. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న ఇచ్చిన హామీని అమలు చేయకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యామంటున్నారు. మేం కడుపు మండి నిరసన తెలుపుతుంటే.. మరోపక్క విజయోత్సవాలంటూ అధికారులు ఎవరూ తమను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వానికి ఇచ్చిన గడువు పూర్తయినందున నేటి నుంచి సమ్మె చేస్తామని, అప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి స్పందించకుంటే ఆమరణ నిరాహార దీక్షకు వెనకాడబోమని స్పష్టం చేస్తున్నారు.

స్తంభించనున్న విద్యా వ్యవస్థ

విద్యాశాఖలో సమగ్ర శిక్ష ఉద్యోగులు వివిధ స్థాయిల్లో పని చేస్తున్నారు. జిల్లా స్థాయిలో ఏపీవోలు, సిస్టమ్ అనలటిక్‌లు, టెక్నికల్ పర్సన్, మండల స్థాయిలో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు.. స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో సీఆర్‌పీలు, పాఠశాల స్థాయిలో పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్, కేజీబీవీలు, యూఆర్ఎస్ పాఠశాలల్లో స్పెషల్ ఆఫీసర్లు, పీజీసీ ఆర్టీలు, వంట మనుషులు, వాచ్ ఉమెన్స్, స్వీపర్స్.. ఇలా అన్ని విభాగాల్లో ఈ ఉద్యోగులు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 19,600 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు ఉండగా.. మంచిర్యాల జిల్లాలో 575, నిర్మల్‌లో 659, ఆసిఫాబాద్‌లో 496, ఆదిలాబాద్ 657 మంది పని చేస్తున్నారు. వీరంతా నేటి నుంచి సమ్మె చేస్తే విద్యా వ్యవస్థ స్తంభించిపోవడం ఖాయంగా కనిపిస్తున్నది. నాన్ టీచింగ్ ఉద్యోగులు అందరూ సమ్మెలో పాల్గొననుండడంతో వసతి గృహాల్లో విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఇప్పటికే వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులకు ఈ సమ్మె శాపంగా మారనుంది. అన్నింటికంటే ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్న నేపథ్యంలో ఉద్యోగుల సమ్మెతో విద్యార్థుల తుది ఫలితాలపైనా ప్రభావం చూపించే అవకాశాలు ఉన్నాయి.

ఉద్యోగుల డిమాండ్‌లు..

- దాదాపు గడిచిన ఇరవై ఏండ్లుగా పాఠశాల విద్య, అభివృద్ధి కోసం పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి. అప్పటి వరకు పే-స్కేల్ ఇవ్వాలి.
- ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలి.
- ఎస్ఎస్ఏ ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్న వారికి, చేసిన వారికి బెనిఫిట్స్ కింద రూ.25 లక్షలు ఇవ్వాలి.
- ప్రభుత్వ, విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజ్ కల్పించాలి.
- పీటీఐలకు 12 నెలల వేతనం ఇవ్వాలి.
- సమగ్ర శిక్ష ఉద్యోగులకు రీ-ఎంగేజ్ విధానాన్ని తొలిగించాలి.

సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి..

గతంలో రెగ్యులరైజ్ కోసం సమ్మె చేసిన సందర్భంగా ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వెంటనే చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటారని ఏడాది కాలంగా ఎదురు చూశాం. నాలుగు రోజులు రిలే దీక్షలు చేస్తున్నా ఎలాంటి స్పందన లేదు. అందుకని ముందు ప్రకటించిన కార్యాచరణను అనుసరించి నేటి నుంచి సమ్మెకు పోతున్నాం. మా న్యాయమైన సమస్యలను పరిష్కారం అయ్యేందుకు ఎంత దూరమైనా పోతాం. అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేపడుతాం.

- రాజన్న, తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం, మంచిర్యాల జిల్లా సెక్రెటరీ.

నోటీసులిచ్చినా పట్టింపు లేదు

సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వస్తే సచివాలయానికి పిలిచి చర్చించి మీ సమస్యలు పరిష్కరిస్తాం అన్నారు. చాయ్ తాగినంత సేపు పట్టదు మీ సమస్య పరిష్కారానికి అని చెప్పారు. కానీ.. యేడాదిగా ఎలాంటి డిమాండ్లు నెరవేర్చలేదు. కొన్ని రోజులుగా మేం పోరాటాలు చేస్తున్నాం. అసెంబ్లీ ముట్టడి చేశాం. జిల్లాల్లో ర్యాలీలు చేశాం. ఇందిరా పార్క్ ఎదుట ధర్నా చేశాం. శాంతియుత పోరాటం చేస్తున్నా ఫలితం లేకపోవడంతో సమ్మె నోటీసులు ఇచ్చాం. సమ్మెకు ముందు నాలుగు రోజులు రిలే దీక్షలు చేపట్టాం. కానీ.. ప్రభుత్వం నుంచి స్పందన లేదు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి. అప్పటి వరకు పే-స్కేల్ అమలు చేయాలి. అప్పటి దాకా ఉద్యోగులందరం సమ్మెలోనే ఉంటాం. *- ఎ.సుమలత, తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు.*

కాగజ్‌నగర్ ఫారెస్ట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ కిరణ్ కుమార్ దోబ్రియాల్ (ఫైల్)

కాగజ్‌నగర్ టైగర్ జోన్‌గా మారనుందా..!

రహస్య నివేదిక సిద్ధమవుతోందా..?

- మూడు రోజులుగా కాగజ్‌నగర్ అడవుల్లో పీసీసీఎఫ్ పర్యటన
- త్వరలో తడోబా, తిప్పేశ్వర్, కన్నెర్‌గాం టైగర్ జోన్‌లలో అధ్యయనం

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): కవ్వాల్ టైగర్ జోన్.. కాగజ్‌నగర్ టైగర్ జోన్‌గా మారనుందా..! కాగజ్‌నగర్ అటవీ ప్రాంతాన్ని పులుల సంరక్షణ కేంద్రంగా మార్చేందుకు అటవీ శాఖ రహస్య నివేదిక సిద్ధం చేస్తున్నారా...? ఇటీవల జిల్లాలో పులుల సంచారం పెరగడం..కాగజ్‌నగర్ అడవుల్లో మూడు రోజుల పాటు పీసీసీఎఫ్ డోబ్రివాల్ పర్యటించడం..తదితర తాజా పరిణామాలు, పరిస్థితులను పరిశీలిస్తే ఈ ప్రాంతం టైగర్ జోన్‌గా మారే సూచనలు కనిపిస్తున్నాయి. మహారాష్ట్రలోని తడోబా, తిప్పేశ్వర్, కన్నెర్‌గాం టైగర్ జోన్‌లలో నుంచి ప్రాణహిత ద్వారా జిల్లాలోకి ప్రవేశిస్తున్న పులులు కాగజ్‌నగర్ అడవుల్లో సంచరిస్తున్నాయి. జిల్లాలో ఇద్దరిపై పులి దాడి చేయగా ఓ మహిళ చనిపోయింది. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అనేక పశువులు పులుల దాడులకు గురై మృతి చెందగా మరికొన్ని గాయాలపాలయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతాన్ని టైగర్ కారిడార్‌గా ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే విషయంపై అటవీ అధికారులు నివేదికలు తయారు చేస్తున్నట్లు తెలుస్తున్నది.

12 ఏళ్లుగా కవ్వాల్‌లో నివాసం ఉండని పులి

కవ్వాల్ టైగర్ జోన్(983 చదరపు కిలోమీటర్లు) ఏర్పాటు చేసి 12 సంవత్సరాలవుతున్నది. ఇప్పటి వరకూ ఒకటి రెండు సార్లు పులి కనిపించి వెళ్లిపోయిందని కాని స్థిర నివాసం ఏర్పర్చుకోలేదు. కవ్వాల్ అడవులు శాఖాహార అటవీ జంతువులు తప్ప పులులు నివాసం ఉండేందుకు యోగ్యంగా లేవని తేలిపోయింది. 12 ఏళ్లుగా నివాసం ఏర్పర్చుకొని ఇక ముందు కూడా ఈ ప్రాంతంలో నివాసం ఉంటుందనే నమ్మకం లేకుండా పోయింది. టైగర్ జోన్‌లో నాలుగేళ్ల కాలంలో పులులు నివాసం ఉండకపోతే దానిని ఎత్తివేసే అవకాశాలు ఉంటాయి. దీంతో అటవీ అధికారులు పులుల సంచారం అధికంగా ఉన్న కాగజ్‌నగర్ అడవులపై దృష్టి సారించారు.

పులులకు సేఫ్‌గా కాగజ్‌నగర్ అడవులు

మహారాష్ట్రలోని తడోబా, తిప్పేశ్వర్, కన్నెర్‌గాం టైగర్‌జోన్‌ల నుంచి ప్రతి సంవత్సరం పులులు రాకపోకలు పెరుగుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో సుమారు 8 పులులు స్థావరాలను ఏర్పాటు చేసుకోగా.. మహారాష్ట్రలోని టైగర్‌జోన్‌ల నుంచి ఇక్కడికి వలస వచ్చే పులుల సంఖ్య పెరుగుతున్నది. జిల్లాలో ఎనిమిది కంటే ఎక్కువే ఉండవచ్చని తెలుస్తున్నది. కాగజ్‌నగర్ అటవీ ప్రాంతం తడోబా, ఇంద్రావతి, అభయారణ్యాలకు కారిడార్ ఉండడంతో పులులు స్వేచ్ఛగా ఇక్కడికి రాకపోకలు సాగిస్తున్నాయి. దట్టమైన అడవులు, పుష్కలమైన నీటి వనరులు, వణ్య ప్రాణులు ఉండడమే కారణం

నివేదికలు సిద్ధం ?

మూడు రోజుల పాటు జిల్లాలోని కాగజ్‌నగర్ అడవుల్లో పర్యటించిన పీసీసీఎఫ్ డోబ్రివాల్, మహారాష్ట్రలోని అటవీ అధికారులతో కో ఆర్డినేషన్ మీటింగ్ కూడా నిర్వహించారు. 12 ఏళ్లుగా పులులు నివాసం ఉండని కవ్వాల్ టైగర్ జోన్ కంటే పులులు అధికంగా సంచరించే కాగజ్‌నగర్ అడవులను పులులకు సేఫ్ జోన్‌గా తీర్చిదిద్దడంపై దృష్టిసారించేందుకు చర్యలు చేపట్టారు. ఇందుకు రహస్య నివేదికలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది. త్వరలోనే తడోబా, తిప్పేశ్వర్, కన్నెర్‌గాం టైగర్‌జోన్‌లలో అధ్యయనానికి వెళ్లనున్నట్లు ప్రకటించారు. కాగజ్‌నగర్ కారిడార్‌ని ఏర్పాటు చేస్తామని పీసీసీఎఫ్ డోబ్రియాల్ చెప్పారు. భవిష్యత్‌లో కాగజ్‌నగర్ టైగర్‌జోన్ ఏర్పాటు చేసే అవకాశం ఉందా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ ఇప్పటికైతే లేదు.. కాని భవిష్యత్‌లో ఏమీ చెప్పలేమని అంటూ మాటను దాటవేశారు..దీనిని బట్టి కాగజ్‌నగర్ టైగర్ జోన్ ఏర్పాటుకు దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. తడోబా, తిప్పేశ్వర్, కన్నెర్‌గాం టైగర్‌జోన్‌ల నుంచి ప్రాణహిత దాటుకొని ఇక్కడికి వలస వచ్చే పులులు ఇక్కడే ఉండేందుకు అనువైన ప్రాంతంగా.. మరింత సురక్షితంగా ఉండే అడవులుగా కాగజ్‌నగర్ ఫారెస్ట్‌ను తీర్చిదిద్దనున్నారు.



కాగజ్‌నగర్ అడవుల్లో స్థిర నివాసం ఏర్పర్చుకున్న పులులు(ఫైల్)

తాండూర్‌లో దట్టమైన పొగమంచు

కెరమెరిలో దారి కనిపించక లైట్లు వేసి వాహనాలు నడుపుతున్న వాహనదారులు

కమ్ముకున్న పొగమంచు

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి మండలంలో పొగమంచు దట్టంగా కమ్ముకున్నది. సోమవారం ఉదయం ఝరి గ్రామంలో ఉదయం 8 గంటలైనా మంచు తెరలు తొలగిపోలేదు. ప్రధాన రహదారి సరిగా కనిపించక పోవడంతో లైట్లు వేసి వాహనాలు నడపాల్సిన పరిస్థితి వచ్చింది. వాకింగ్, వ్యవసాయ పనులకు వెళ్లే వారు ఇబ్బంది పడ్డారు. వాతావరణం చల్లగా మారడంతో మంట కాగారు. మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలోనూ మంచు కమ్ముకున్నది. - కెరమెరి/తాండూర్, డిసెంబర్ 9

మావోయిస్టు సభ్యుడు రవి తల్లి లక్ష్మితో మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

అజ్ఞాతం వీడి.. జనంలోకి రావాలి

బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

మందమర్రి, డిసెంబర్ 9: అజ్ఞాతం వీడి జన జీవన స్రవంతిలో కలిసి ప్రశాంతమైన జీవితం గడపాలని మావోయిస్టులకు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఊరు మందమర్రి గ్రామానికి చెందిన మావోయిస్టు సభ్యుడు బబ్బెర రవి ఇంటికి వెళ్లి అతని తల్లి లక్ష్మిని కలిసి ఆమె ఆరోగ్య పరిస్థితులను ఏసీపీ తెలుసుకున్నారు. సుమారు 24 సంవత్సరాలుగా అజ్ఞాతంలో ఉన్న రవిని లొంగిపోవాలని చెప్పాలని సూచించారు. లక్ష్మికి పలు నిత్యావసర వస్తువులు, 25 కిలోల బియ్యం, దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సాధ్యం కానీ సిద్ధాంతాలు, ఆశయాలతో అడవిలో ఉంటూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారే తప్ప సాధించిందేమీ లేదన్నారు. జనజీవన స్రవంతిలో కలిస్తే పునరావాసం కల్పిస్తామని, అనారోగ్యంతో ఉన్న వారికి మెరుగైన చికిత్స అందిస్తామని హామీ ఇచ్చారు. మావోయిస్టులు అడవిలో ఉండి కుటుంబ సభ్యుల పరిస్థితులను అర్థం చేసుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పులి దాడిలో లేగ దూడ మృతి

వేమనపల్లి, డిసెంబర్ 9 : మండలంలోని ఒడ్డుగూడెం ఫారెస్ట్ సెక్షన్ పరిధిలో లేగ దూడపై పులి దాడి చేసి చంపేసిన ఘటన సోమవారం వెలుగుచూసింది. రెండు రోజుల క్రితం ఈ ప్రాంతంలో ఆవుల మందపై పులి దాడి చేయగా గాయాలతో తప్పించుకున్న ఆవు యజమాని హనుమయ్య ఇంటికి చేరుకున్నది. మందలోని లేగ దూడ రాకపోవడంతో సుంపుటం గ్రామానికి చెందిన యజమాని కొండగొర్ల రాజన్న ఫారెస్ట్ అధికారులకు తెలిపాడు. కుష్టపల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి దయాకర్ ఆధ్వర్యంలో సోమవారం డిప్యూటీ రేంజర్ రూపేశ్, ఒడ్డుగూడెం సెక్షన్ అధికారి బేగ్‌లు బేస్ క్యాంపు సిబ్బందితో గాలించారు. పులి దాడి చేసిన ప్రాంతం నుంచి వంద మీటర్ల దూరంలో లేగదూడ కళేబరాన్ని గుర్తించారు. పులి దాడి చేసినట్లు అటవీ అధికారులు నిర్ధారించారు. వెటర్నరీ వైద్యురాలు సుప్రియ పోస్టుమార్టం నిర్వహించారు. లేగ దూడ విలువ రూ.10 వేలు ఉంటుందని నష్టపరిహారం ఇప్పించాలని బాధితుడు కోరాడు.

లేగ దూడ కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు